
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



సోమశిలలో 53.168 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 53.168 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 24,300 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.77,710
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,054
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,266
నవర (8 గ్రాములు)	రూ.58,128

గరిష్టం/కనిష్టం
35.1 /26.8

వాతావరణం

జిల్లాలో పలుచోట్ల గురువారం చిరు జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బుధవారం గాలిలో తేమ 62 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వచ్చే నెల 3 నుంచి టెట్

నెల్లూరు (టౌన్): ఏపీ టెట్ (టీచర్ ఎలిజిబుల్ టెస్ట్) వచ్చే నెల 3 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను జిల్లాలోని పీబీఆర్ విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాల (కావలి), రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (కడనూతల) నారాయణ ఇంజినీరింగ్ కళాశాల (నెల్లూరు), అయాన్ డిజిటల్ సెంటర్ (పొట్టేపాళెం)లో జరుగుతుందన్నారు. అభ్యర్థులు సమయానికి అర్ధగంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఐడీ ప్రూఫ్ (ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు కార్డు, పాన్ కార్డు) ఏదో ఒకటి తప్పని సరిగా తీసుకు రావాలన్నారు. సెల్‌ఫోన్, బ్లూటూత్, స్మార్ట్ వాచ్, ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. మరిన్ని వివరాకు 78932 58325, 944114 8062, 63053 64463 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బినామీ మస్టర్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వెంకటేశ్వర్లు

దుత్తలూరు: మండలంలోని కొత్తపేటలో ఉపాధి హామీ పనుల్లో బినామీ మస్టర్లు నమోదు చేసి నిధులు కాజేస్తున్నారని కలెక్టర్ ఆనంద్‌కు రైతు సంఘం మండల కార్యదర్శి పచ్చవ వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయగిరికి వచ్చిన కలెక్టర్‌కు పచ్చవ వెంకటేశ్వర్లు ఆధారాలతో సహా అందజేశారు. మేట్ విష్ణు, ఏపీఓ, టీఏ, ఈసీలతో కలిసి బినామీ మస్టర్లు నమోదు చేసి నిధులు గోల్‌మాల్ చేసేందుకు పథకం పన్నారన్నారు. తక్కువ మంది పనికి వస్తున్నా.. ఎక్కువ మందిగా చూపి హాజరు వేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ స్పందిస్తూ తన వెంట ఉన్న జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసులును కొత్తపేట వెళ్లి విచారించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. దీంతో ఆయన కొత్తపేటకు చేరుకుని పలువురు కూలీలను విచారించారు.

తప్పుపై తప్పు

కోర్టు వివాదంలో ఉన్న నిషేధిత భూమికి రిజిస్ట్రేషన్

నెల్లూరు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తప్పుపై తప్పు చేస్తూ అడ్డంగా దొరికి పోతున్నారు. కోర్టు వివాదంలో ఉండి ఆ న్యాయస్థానం ఆదేశాలతో నిషేధిత జాబితాలో చేర్చిన భూమి అని తెలిసినా.. రూ.కోట్లలో ముడుపులు తీసుకుని అడ్డదారుల్లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో అడ్డంగా దొరికిపోయిన సదరు సబ్ రిజిస్ట్రార్ తప్పును కప్పిపుచ్చుకునేందుకు మరో తప్పు చేసి ఈ దఫా నిలువునా బుక్కయ్యాడు. అన్నీ తెలిసినా.. ఏమీ తెలియనట్లు జిల్లా రిజిస్ట్రార్ నుంచి డీఐజీ వరకు నంగనాచి కబుర్లు చెబుతున్నారు.

- బయటకు పొక్కడంతో రిజిస్టర్ డాక్యుమెంట్ తిరస్కరణ
- రెగ్యులర్ నంబర్ వచ్చిన పత్రంను రద్దు చేసే అధికారం ఎస్ఆర్‌కు లేదు
- క్రయవిక్రయదారుల సమ్మతితో రద్దు చేయొచ్చు
- కోర్టు ఆదేశాలతోనే రద్దు చేసే అవకాశం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అక్రమాలకు, అవినీతికి అలవాటు పడిన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తమ అధికారాలనే మరిచిపోతున్నారు. కోర్టు ఉత్తర్వులతో నిషేధిత జాబితాలో ఉన్న భూమికి ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానంతో రిజిస్టర్ చేసేందుకు బరి తెగించిన నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్, ఆపై తనకు లేని అధికారాలతో సదరు డాక్యుమెంట్‌ను తిరస్కరించేందుకు సాహసించారు. కోర్టు ఆదేశాలను ధిక్కరించి తప్పు చేసి.. ఆ తప్పు నుంచి తప్పించుకునేందుకు మరో తప్పునకు పాల్పడిన జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ వ్యవహార శైలి మరోసారి చర్చనీయాంశంగా మారింది.

అసలేం జరిగిందంటే..

నెల్లూరు నగరంలోని మైపాడుగేట్ సమీపంలో ఉన్న సర్వే నంబర్ 312/4లోని భూమికి సంబంధించిన వివాదం కోర్టులో నడుస్తోంది. ఈ క్రమంలో కోర్టు ఆదేశాల మేరకు ఆ సర్వే నంబర్‌లో భూమి క్రయవిక్రయాలు జరగకుండా నిషేధిత జాబితాలో చేర్చారు. అయితే ఆ భూమికి రిజిస్ట్రేషన్ చేసేందుకు సదరు సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించారు. రూ.కోట్లలో బేరసారాలు జరగడంతో రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్న లొసుగులు, అవకాశాలను వినియోగించుకున్నారు. ఈ భూమికి సంబంధించి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ)ని సృష్టించారు. సదరు జీపీఏ ద్వారా ఇటీవల నెల్లూరులోనే మరో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ద్వారా రెగ్యులర్ నంబరు 29604/2024తో రిజిస్టర్ చేశారు. వెంటనే స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ అప్రూవల్ ఇచ్చేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్ బయటపడడంతో..

ఈ అక్రమ రిజిస్ట్రేషన్ గుట్టు రట్టు కావడంతో చేసిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగియగానే ఎన్ కంబ్రన్స్ (ఈసీ)లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తి పేరు, డాక్యుమెంట్ నంబర్ కనబడకుండా ఆన్‌లైన్‌లో బ్లాక్ చేయించారు. ఈ వ్యవహారంపై రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ శేషగిరిబాబు సీరియస్‌గా స్పందించారు. ఆయన విచారణకు ఆదేశించారు. అవినీతికి పాల్పడిన ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు, ఒక సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు.

> **డాక్యుమెంట్ తిరస్కరించారు**
>
> నిషేధిత జాబితాలో ఉన్న భూముల అక్రమ రిజిస్ట్రేషన్ ఇరుపార్టీల అంగీకారం లేకుండా తిరస్కరించకూడదు. అది మా పరిధిలో ఉండదు. నేను కొత్తగా జాయిన్ అయ్యాను. ఆ సమాచారం పూర్తిగా తెలియదు. విచారించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనలు మేరకు చర్యలు తీసుకుంటాం.
>
> – హరివర్మ, జిల్లా రిజిస్ట్రార్

లేని అధికారంతో డాక్యుమెంట్ తిరస్కరణ

ఒకసారి రెగ్యులర్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ జరిగిన డాక్యుమెంట్‌ను రద్దు చేసే అధికారం ఆ శాఖలోని సబ్ రిజిస్ట్రార్ నుంచి ఐజీ వరకు ఎవరికీ లేదు. ఒక వేళ ఇరు పార్టీలు పరస్పర అంగీకారంతో రద్దు చేసుకునే అవకాశం ఉంది. లేదా ఇరుపక్షాలు కానీ, సదరు రిజిస్ట్రేషన్ ఇల్లీగల్ అని ఉన్నతాధికారులు కోర్టును ఆశ్రయిస్తే.. కోర్టు ఆదేశాలతో రద్దు చేసే అవకాశం ఉంది. అయితే అందుకు విరుద్ధంగా నెల్లూరు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చేసిన అక్రమాలను, తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రెఫ్యూజల్ ఉత్తర్వులు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ జరగని డాక్యుమెంట్‌కు మాత్రమే రెఫ్యూజల్ చేసే అధికారం ఉంటుంది. ఇలా తప్పు చేసిన సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్‌కు ముందే రెఫ్యూజల్ ఇవ్వడంపై ఆ శాఖ ఉన్నతాధికారులు కనీసం స్పందించలేదు. చర్యలు తీసుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా రెఫ్యూజిల్ వేసిన అధికారిపై క్రిమినల్ కేసులు ఎందుకు నమోదు చేయలేదనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

కోర్టుకు చేరిన వివాదం

రిజిస్ట్రేషన్ శాఖలో జరిగిన అక్రమాలపై క్రయవిక్రయదారులు న్యాయస్థానాలకు వెళ్లారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని ఒకరు.. చేసిన రిజిస్ట్రేషన్ దస్తావేజులు ఇప్పించాలని మరొకరు ఇలా న్యాయస్థానాలను ఆశ్రయించారు. అధికారులు చేసిన అక్రమ రిజిస్ట్రేషన్‌పై న్యాయస్థానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

జిల్లాలో టీడీపీ శ్రేణులు తాలిబన్లనే తలదన్నే రీతిలో వ్యవహరిస్తున్నారు. ఊరూరా పార్టీ కేడర్ మాఫియాగా తయారై ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా దందాకు పాల్పడుతోంది. అడ్డొస్తే అంతం చేయడానికి కూడా వెనుకాడడం లేదు. నా అడ్డాలో అక్రమ దందాకు తావులేదని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పి కొన్ని గంటలు గడవక ముందే ఆమె పార్టీ నేతలు ఇసుక అక్రమ రవాణాకు బరితెగించారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన సర్పంచ్‌తో పాటు గ్రామస్తుల పైనే దాడులకు తెగబడ్డారు. జిల్లాలో ఆ ఊరు.. ఈ ఊరు అనే తేడా లేకుండా రాత్రి, పగలు విచ్చలవిడిగా సహజ వనరులు దోపిడీ చేస్తున్నా జిల్లా అధికార యంత్రాంగం కళ్లప్పగించి చూస్తోంది.

ఇసుక మాఫియా బరితెగింపు

- అక్రమ రవాణాను అడ్డుకున్న సర్పంచ్, స్థానికులపై దాడి
- బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లిలో ఘటన
- ఎమ్మెల్యే ఆదేశాలనే ధిక్కరించిన తమ్ముళ్లు
- రాత్రి వేళ ఇసుక అక్రమ రవాణా
- జిల్లా అంతటా రెచ్చిపోతున్న పచ్చ ముఠాలు



కోడూరుపాడులో రాత్రి 12 గంటల సమయంలో ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఊరూరా సహజ వనరులు దోపిడీ నిత్యకృత్యమైంది. ఇసుక, మట్టి, గ్రావెల్‌ను అక్రమ రవాణా సాగిస్తూ వేల రూ.కోట్లు కొల్లగొట్టారు. ఈ అక్రమ దందాపై జిల్లాలోని ఏ ఒక్క ప్రజాప్రతినిధి కూడా నోరు మెదపడం లేదు. తెరవెనుక ఉండి.. అక్రమ దందాను నడిపిస్తున్నారనే ప్రచారం లేకపోలేదు. నా నియోజకవర్గంలో అక్రమ దందాకు తావులేదని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి బహిరంగంగానే చెబుతున్నా.. ఇక్కడే విచ్చలవిడిగా అక్రమ రవాణా జరుగుతోంది.

కోవూరులో రెచ్చిపోయిన తమ్ముళ్లు

ప్రతిరోజూ జొన్నవాడ సమీపంలో మినగల్లు రీచ్ నుంచి ఇసుక, పెనుబల్లి పొలాల నుంచి మట్టి అక్రమ రవాణా విచ్చలవిడిగా జరుగుతోంది. స్థానిక టీడీపీ నేతలు కొందరు యువకులను ముందు పెట్టి ఇసుకను అక్రమంగా తరలిస్తూ రూ.లక్షల్లో జేబులు నింపుకుంటున్నారు. ఇక్కడి అక్రమ రవాణాపై అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో స్థానికులే అడ్డుకునేందుకు సిద్ధపడ్డారు. మంగళవారం రాత్రి జొన్నవాడ నుంచి ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను పెనుబల్లి వద్ద సర్పంచ్ పెంచలయ్యతో పాటు వెంకటేశ్వర్లు, సురేష్‌రెడ్డి అడ్డుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ జొన్నవాడలోని తన యజమానికి సమాచారం అందించారు. జొన్నవాడకు చెందిన టీడీపీ కార్యకర్తలు ప్రణీత్, ప్రసాద్ మరికొంత మంది పెనుబల్లి వద్దకు చేరుకుని వారిపై ఏకంగా దాడులకు తెగించారు. ట్రాక్టర్‌తో వారిని తొక్కించేందుకు ప్రయత్నించారు.

ఇసుక ఎక్కడి నుంచి వస్తోంది..

జిల్లాలో పెన్నాతీరంలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు. డంపింగ్ యార్డుల్లో నిల్వలు లేవు. మరి ఇసుక విచ్చలవిడిగా ఎలా బయటకు వస్తోంది. టీడీపీ నాయకులు ఊరూరా ఒక మాఫియాగా తయారయ్యారు. పెన్నానదిలో ఇసుక తోడేసి అక్రమ రవాణా చేస్తున్నారు. ఎవరైనా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే ప్రాణాలు తీయడానికి కూడా సిద్ధపడుతున్నారు. ఇసుక, మట్టి, గ్రావెల్ తరలించే వాహనాలతో తొక్కించేందుకు వెనుకాడడం లేదు. కోవూరులో పరిస్థితి ఇలా ఉంటే.. సర్వేపల్లిలో అయితే ఏకంగా కలెక్టర్, ఎస్పీలనే బెదిరించే స్థాయికి చేరారు. ఇంత జరుగుతున్నా.. ఒక ఊరులో ఒక్క కేసైనా నమోదు చేయలేదంటే టీడీపీ నేతలు తాలిబన్లు మాదిరిగా అధికార వ్యవస్థనే శాసిస్తున్నారని స్పష్టమవుతోంది.

> **110 రోజుల్లో రూ.15 వేల కోట్ల దోపిడీ**
>
> సర్వేపల్లి మొదలు, నెల్లూరు రూరల్, ఆత్మకూరు, కోవూరు, కందుకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లో టీడీపీ నేతల కనుసన్నల్లో సహజవనరుల దోపిడీ ఓ రేంజ్‌లో జరుగుతోందని జిల్లాలో ఉన్నత స్థాయి అధికారి ఒకరు చెప్పారు. ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణా లెక్క కడితే.. నిత్యం రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్ల మేర జరుగుతోంది. ఈ లెక్కన సగటున టీడీపీ అధికారంలోకి వచ్చిన 110 రోజుల్లో సుమారు రూ.15 వేల కోట్ల పైబడి దోచుకున్నట్లు తెలుస్తోంది.

మాగుంట పార్వతమ్మకు అశ్రునివాళి



మాగుంట పార్వతమ్మ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరుసిటీ/నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)/నెల్లూరు (దర్గామిట్ట)/ నెల్లూరు(బృందావనం): మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ పార్థివ దేహానికి మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఘన నివాళులర్పించారు. పార్వతమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ చెన్నైలో బుధవారం మృతి చెందగా నెల్లూరులోని మాగుంట నివాసానికి పార్థివదేహాన్ని తీసుకువచ్చారు. ఆదాల తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని పరామర్శించారు.

పార్వతమ్మ మరణం తీరని లోటు

మాగుంట పార్వతమ్మ పార్థివ దేహానికి మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఘన నివాళి అర్పించారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా మాగుంట పార్వతమ్మ ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివిగా కాకాణి పేర్కొన్నారు.

అరుణమ్మ దంపతుల నివాళి

జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు.

మంత్రి నారాయణ సంతాపం

మాజీ ఎంపీ, ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతి బాధాకరమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ బుధవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. పార్వతమ్మ మరణం నెల్లూరు, ఒంగోలు వాసులకు ప్రత్యేకంగా కావలి వాసులకు తీరని లోటన్నారు.

మంత్రి ఆనం ప్రగాఢ సానుభూతి

మాగుంట పార్వతమ్మ మృతికి రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె మరణం బాధాకరమన్నారు. ప్రజానేతగా, వివాదరహితులుగా, సౌమ్యులుగా రాజకీయాల్లో వారు పేరు గడించారని తెలిపారు. భర్త మరణంతో పార్వతమ్మ ఆకస్మికంగా రాజకీయాల్లోకి వచ్చిన అనతికాలంలోనే ప్రజాదరణ పొందారన్నారు.

వేమిరెడ్డి దంపతుల నివాళి

మాగుంట పార్వతమ్మ భౌతికకాయానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఘన నివాళులర్పించారు. నెల్లూరులోని మాగుంట నివాసంలో పార్వతమ్మ భౌతికకాయానికి నివాళులర్పించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. మాగుంట పార్వతమ్మ మృతి బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.





చెప్పిందే రేటు.. వేసిందే తూకం

- కూరగాయల మార్కెట్లో నయా మోసం
- చేపల మార్కెట్లోనూ ఇదే తీరు
- కిలోకు 150 నుంచి 200 గ్రాముల వరకు తేడా

నెల్లూరు (సెంట్రల్): నెల్లూరులోని ప్రధాన కూరగాయల మార్కెట్... చేపల మార్కెట్... ఇంకా పలుచోట్ల .తూకాల్లో మోసం చేస్తూ వినియోగదారులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారు కొందరు వ్యాపారులు. తాము చెప్పిందే రేటు.. వేసిందే తూకమనే విధంగా కొనుగోలుదారుల జేబుకు చిల్లు వేస్తున్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని కూరగాయల మార్కెట్లో కొనుగోలుదారులపై పలువురు షాపు నిర్వాహకులు దౌర్జన్యాలు చేస్తుండటం గమనార్హం. ఇక పారిశుధ్యం, పార్కింగ్ విషయంలో చెప్పనక్కర్లేదు. మార్కెట్లోకి మహిళలు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడంతో చిన్నపాటి వర్షమొస్తే కాలు పెట్టలేని పరిస్థితి. తూకాల్లో తేడాలొస్తున్నాయని సంబంధిత అధికారులకు ఫిర్యాదులు అందితే ఒక రోజు హడావుడిగా తనిఖీలు చేస్తున్నా.. మరుసటి రోజు నుంచి మార్కెట్లో తూకాల్లో తేడా యథాతథంగా ఉంటోంది.



నెల్లూరు నగరంలోని కూరగాయల మార్కెట్

కనిపించని ధర్మకాటా

ఏసీ కూరగాయల మార్కెట్లో ధర్మకాటా గతంలో ఉండేది. వినియోగదారులు ఎవరైనా మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేసి అనుమానం వస్తే అక్కడే ఉన్న ధర్మకాటాలో తూకం వేసే చూసుకునే వీలుండేది. అయితే కొన్ని నెలలుగా మార్కెట్లో ధర్మకాటా లేకపోవడం గమనార్హం. ఈ విషయమై అధికారులను సంప్రదించగా, గతంలో ఏమి జరిగిందో తమకు తెలియదని, ధర్మకాటాను త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పడం గమనార్హం.

పారిశుధ్యం అధ్వానం

కూరగాయల మార్కెట్లో అధ్వానంగా మారిన పారిశుధ్యంతో అక్కడికి వచ్చే కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక పార్కింగ్ విషయంలో మార్కెట్ లోపలే వాహనాలను నిలుపుతుండటంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. పార్కింగ్, పారిశుధ్య విషయంలో సంబంధిత అధికారులు శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది.

చేపల మార్కెట్లోనూ..

ఈ తూకాల్లో మోసం చేపల మార్కెట్లోనూ ఉంది. నెల్లూరులో పలుచోట్ల రోడ్లపై పెట్టి చేపలు, రొయ్యలను విక్రయిస్తున్న కొందరు తూకాల్లో మోసం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించి చర్యలు చేపట్టిన సందర్భాలూ ఉన్నాయి. అయితే కొందరు మాత్రం తమ ధోరణిని మార్చుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

తూకాల్లో సరికొత్త మోసం..

నెల్లూరు నగరంలో ఏసీ కూరగాయల మార్కెట్ ప్రధానమైంది. ఇక్కడికి స్థానికులే కాకుండా నెల్లూరు చుట్టుపక్కల నుంచి ప్రజలు వచ్చి కూరగాయలను కొనుగోలు చేస్తుంటారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో చాలా మంది ఈ మార్కెట్లో కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడ కిలో టమోటాలను కొనుగోలు చేసి ఇంటికెళ్లి సరిచూస్తే 800 గ్రాముల నుంచి 850 గ్రాముల వరకే ఉండటం గమనార్హం. రేటు మాత్రం కిలోకి తీసుకుంటూ తూకంలో వినియోగదారులను మోసం చేస్తున్నారు. కూరగాయల మార్కెట్లో దాదాపు 320కుపైగా షాపులున్నాయి. వీటి ద్వారా నిత్యం దాదాపు ఐదు వేల కిలోల వరకు వివిధ రకాల కూరగాయలను విక్రయిస్తుంటారు. కిలోకు 150 గ్రాముల్లెక్కన మొత్తమ్మీద రోజుకు పెద్ద మొత్తంలో తూకాల్లో దోపిడీ జరుగుతోందని తెలుస్తోంది.



మూలాపేటలోని చేపల మార్కెట్

చర్యలు చేపడతాం

కూరగాయల మార్కెట్లో గానీ, చేపల మార్కెట్లో గానీ ఎక్కడైనా తూకాల్లో ఏ చిన్న తేడా వచ్చినా చర్యలు చేపడతాం. మార్కెట్లోని అనేక షాపుల్లో గతంలో దాడులు చేసి తూకాల్లో మోసం ఉండటంతో కాటాలను సీజ్ చేసి చర్యలు చేపట్టాం. అదే విధంగా చేపల విక్రయాల్లో తేడాలున్నాయనే విషయం మా దృష్టికి వచ్చింది. తప్పకుండా చర్యలు చేపడతాం.

– ఈశ్వర్, అసిస్టెంట్ కమిషనర్, లీగల్ మెట్రాలజీ

మార్కెట్లో ఇబ్బందులు వాస్తవమే

కూరగాయల మార్కెట్లో ప్రజలకు కొన్ని ఇబ్బందులు కలుగతోంది వాస్తవమే. ఇటీవలే వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించాం. పారిశుధ్యం, పార్కింగ్ విషయాల్లో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. తూకాల్లో మోసంపై ఫిర్యాదులొస్తే తూనికలు, కొలతల శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇటీవల పలువురు వ్యాపారుల కాటాలు కూడా తీసుకున్నారు. ధర్మకాటా విషయంలో గతంలో ఏమి జరిగిందో తెలియదు. త్వరలోనే దీన్ని ఏర్పాటు చేస్తాం.



– శ్రీనివాసులు, మార్కెట్ సెక్రటరీ

తూకంలో తేడాలొస్తున్నాయి

కూరగాయల మార్కెట్లో తూకాల్లో చాలా మోసం చేస్తున్నారు. ధరలు మాత్రం కిలోకు తీసుకుంటూ తూకం మాత్రం తగ్గించి వేస్తున్నారు. ధర్మకాటా చూస్తే అక్కడ ఉండటం లేదు. వీటితో పాటు పార్కింగ్, పారిశుధ్య విషయాల్లో ప్రజలకు అసౌకర్యంగా ఉంటోంది. వీటిపై చర్యలు చేపట్టాలి.



– ప్రసన్నకుమార్‌రెడ్డి, అల్లీపురం

వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉంది

మార్కెట్లోకి వెళ్లాలంటేనే చాలా ఇబ్బందులున్నాయి. వాహనాలను రోడ్డుగా అడ్డంగా పెడుతున్నారు. ప్రధానంగా తూకాల్లో చాలా తేడా ఉంటోంది. కొనుగోలు చేసిన కూరగాయలను బయట తూకం వేయిస్తే తేడా వచ్చింది. నగదు మాత్రం కిలోకు తీసుకుంటున్నారు. వీటిపై చర్యలు చేపట్టాలి.

– సుధారాణి, నెల్లూరు

న్యాయవాదుల విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): న్యాయవాదుల చట్టానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలను నిరసిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బుధవారం బహిష్కరించారు. దీంతో వివిధ కోర్టుల్లో కేసులు విచారణ జరగక వాయిదా పడ్డాయి. న్యాయవాదుల విధుల బహిష్కరణ, నిరసన కార్యక్రమం గురు, శుక్రవారాల్లో కొనసాగనుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



ప్రేమజంటతో మాట్లాడుతున్న ఎస్సై హనీఫ్

పొదలకూరు: ఓ ప్రేమజంట పొదలకూరు పోలీసులను ఆశ్రయించి తమకు రక్షణ కల్పించాలని మంగళవారం రాత్రి విజ్ఞప్తి చేసింది. దీనికి సంబంధించిన వివరాలను పోలీసులు బుధవారం వెల్లడించారు. చేజర్ల మండలం ఏటూరుకండ్రికకు చెందిన మహిత, పొదలకూరుకు చెందిన నవీన్ ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. జొన్నవాడలో మూడు రోజుల క్రితం వీరు వివాహం చేసుకున్నారు. ఈ పెళ్లి తమ తల్లిదండ్రులు, బంధువులకు ఇష్టం లేదని, వారి నుంచి ప్రాణహాని ఉందని పోలీసులు, మీడియా ఎదుట మహిత వాపోయారు. ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని, తమపై దాడులు చేసేందుకు యత్ని స్తున్నారని ఆరోపించారు. కాగా మహిత అదృశ్యమైనట్లు చేజర్ల పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. విచారణ జరిపి ప్రేమజంటకు రక్షణ కల్పిస్తామని ఎస్సై వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.100
సన్నవి : రూ.50
పండ్లు : రూ.35



గోవా మద్యం బాటిళ్ల స్వాధీనం

ఉలవపాడు: గోవా మద్యం బాటిళ్లు అమ్ముతున్న ఇద్దరిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చాకిచర్ల హైస్కూల్ సమీపంలో మద్యం విక్రయిస్తున్నారని సమాచారం మేరకు ఎస్సై అంకమ్మ తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. గుడ్లూరు మండలం మోచెర్ల గ్రామానికి చెందిన పచ్చిపాల వినోద్, కావలి మండలం ముసునూరు గ్రామానికి చెందిన అడపాల మనోజ్‌కుమార్ నుంచి 93 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గోవాకు చెందిన ఈ మద్యంను నెల్లూరుకు చెందిన బుజ్జి అలియాస్ అబ్దుల్ అజీజ్ వద్ద నుంచి తీసుకువచ్చినట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

టీడీపీలో నామినేటెడ్ కుంపటి

- తొలి జాబితాలో సీనియర్లకు దక్కని చోటు
- జిల్లాకు నామమాత్రపు పదవులు
- అలకబూనిన నేతలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నామినేటెడ్ పోస్టులు టీడీపీలో కుంపటిని రాజేశాయి. తమకు పదవులొస్తాయని ఆశించిన పలువురికి భంగపాటే ఎదురైంది. రాష్ట్ర వ్యాప్తంగా 20 చైర్మన్ పోస్టులను భర్తీ చేయగా, అందులో జిల్లాలో టీడీపీకి ఒకటి దక్కింది. జనసేన కోటాలో నెల్లూరు వాసికి స్థానం లభించినా, ఆయన జిల్లా రాజకీయాల్లో పెద్దగా కనిపించరు. ముగ్గురికి డైరెక్టర్ పోస్టులు లభించినా, అవి ప్రాధాన్యమైనవి కాకపోవడం.. దక్కించుకున్న వారు రాజకీయ నేపథ్యం లేని వారు కావడంతో సీనియర్లు భగ్గుమంటున్నారు. పార్టీ కష్టకాలంలో జెండాలు మోసినా తమకు ప్రాధాన్యం లేకపోవడంపై అసంతృప్తితో రగిలిపోతున్నారు.

ఆశించిన పోస్టేదీ..?

మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్‌కు వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నామినేటెడ్ పోస్టు లభించినా ఆయన సంతృప్తిగా లేరు. వాస్తవానికి 2014లో ఈయనకు మేయర్‌గా అవకాశాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కల్పించింది. అయితే ఆయన టీడీపీలోకి ఫిరాయించారు. 2019 ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి పార్టీ కోసం పనిచేసినా, 2024 ఎన్నికల్లో మొండిచేయి చూపి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి టికెట్‌ను టీడీపీ ఖరారు చేసింది. అలకబూని పార్టీ ఫిరాయించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నా, చివరి క్షణంలో నారాయణ బుజ్జగించి ఎమ్మెల్సీ హామీతో పార్టీలో కొనసాగేలా చేశారు. అయితే అజీజ్ ఆశలను ఆవిరి చేసి చివరికి వక్ఫ్ బోర్డు చైర్మన్ పదవికే పరిమితం చేశారు.

ఎంతో మంది తీరు ఇదే..

పార్టీలో ఎన్నో ఏళ్లుగా సీనియర్లుగా ఉంటూ ప్రతి ఎన్నికల్లో టికెట్ ఆశించి చివరికి భంగపాటుకు గురైన వారెందరో ఉన్నారు. తొలి జాబితాలో చోటు దక్కకపోవడంతో అసహనంతో రగిలిపోతున్నారు.

- మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు మరోసారి ఎమ్మెల్సీ అనే హామీతో నెట్టుకొస్తున్నారు.
- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి పార్టీ ఆవిర్భావం నుంచే పనిచేస్తున్నా, ఏ పదవీ దక్కడంలేదు.
- కోవూరుకు చెందిన సీనియర్ నేత పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి ప్రతిసారి టికెట్ ఆశించి. భంగపాటుకు గురవుతున్నారు.
- కోవూరు ఎమ్మెల్యే టికెట్‌ను ఆశించిన పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, కావలి నియోజకవర్గంలో పార్టీకి అండగా ఉన్న మాలేపాటి సుబ్బానాయుడు, నెల్లూరు సిటీ నియోజకవర్గంలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, బొల్లినేని రామారావు, జెడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, నేతలు గూటూరు కన్నబాబు, ఆనం వెంకటరమణారెడ్డి, అనూరాధ, డాక్టర్ జెడ్ శివప్రసాద్ లాంటి సీనియర్ నేతలు నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్నారు. కీలక పోస్టులను ఇతర జిల్లా వాసులు ఎగరేసుకుపోవడంతో వీరు అలకపాన్పుపై ఉన్నారు. రెండో జాబితాలోనూ వీరికి అవకాశాలు నామమాత్రమే.

పట్టాభికి సై..

తన ప్రధాన అనుచరుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డికి సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పోస్టును ఇప్పించడంలో మంత్రి నారాయణ సఫలీకృతులయ్యారు. గత ఎన్నికల సమయంలో పట్టాభి పనిచేస్తే చాలా మంది సీనియర్లు దూరమయ్యే అవకాశం ఉందని గ్రహించిన నారాయణ ఆయన్ను పక్కనబెట్టారు. అయితే నామినేటెడ్ పోస్టుల్లో మాత్రం తొలి ప్రాధాన్యమివ్వడాన్ని సీనియర్లు సహించలేకపోతున్నారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో నారాయణ ఇటీవలి కాలంలో విభేదిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి నారాయణ ముఖం చాటేసినా పార్టీకి ఈయన అండగా ఉన్నారు. ప్రస్తుతం అధికారం రాగానే సీనియర్లను పక్కన బెట్టడంపై మండిపడుతున్నారు.

ఎన్నికల వేళ వచ్చిన వారి సంగతేమిటో..?

సార్వత్రిక ఎన్నికల వేళ టికెట్ ఆశించిన వారితో పాటు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన నేతలు సైతం నామినేటెడ్ పోస్టుల కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు. గిరినాయుడు, పుట్టం బ్రహ్మానందరెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి లాంటి నేతలు ఈ వరుసలో ఉన్నారు. మరో జాబితాలోనైనా తమకు అవకాశం లభించకపోదా అనే ఆశతో వీరున్నారు.

ఎక్సైజ్ శాఖలో పలువురి బదిలీ



నూతన డీసీ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర వ్యాప్తంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖలో డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లా డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజును ఒంగోలుకు బదిలీ చేసి ఆయన స్థానంలో విజయవాడ ఏపీఎస్బీసీఎల్‌లో విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసరావును నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్‌ను నెల్లూరు ఏసీగా నియమించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిగా పనిచేస్తున్న నాగమల్లేశ్వరరెడ్డిని తిరుపతికి, వెయిటింగ్‌లో ఉన్న శ్రీనివాసులునాయుడ్ని నెల్లూరుకు కేటాయించారు. తాజాగా డిప్యూటీ కమిషనర్‌గా నియమితులైన శ్రీనివాసరావు జిల్లాకు సుపరిచితులే. 2015 నుంచి రెండేళ్ల పాటు జిల్లాలో డిప్యూటీ కమిషనర్‌గా సమర్థంగా విధులను ఆయన నిర్వర్తించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 134	బ్రాయిలర్ చికెన్	: 240
లేయర్ (లైవ్)	: 115	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 264
		లేయర్ చికెన్	: 195



సమ్మె కొనసాగింపుపై నోటీస్



డీఎంహెచ్ఓకు నోటీస్‌ను అందజేస్తున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): తమ డిమాండ్లు పరిష్కారం కాకపోవడంతో సమ్మెను కొనసాగిస్తామని పీహెచ్‌సీల్లోని డాక్టర్లు స్పష్టం చేశారు. ఈ మేరకు సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ పెంచలయ్యకు నోటీస్‌ను బుధవారం అందజేసిన అనంతరం పీహెచ్‌సీల అసోసియేషన్ అధ్యక్షుడు అమరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. తాము పది రోజులుగా ఆందోళన చేస్తున్నా, ప్రభుత్వం స్పందించడంలేదని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను ఆపే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. అనంతరం వైద్యశాఖ కార్యాలయం వద్ద ధర్నాను నిర్వహించారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పీఎం సూర్యఘర్ పథకంపై ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలోని అధికారులు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో గల తన చాంబర్ నుంచి జిల్లాలోని డీఈలు, డీఈఈలు, ఏఈలు, అకౌంట్స్ ఆఫీసర్లతో బుధవారం నిర్వహించి టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. విద్యుత్ బకాయి వసూళ్లలో డీ లిస్టును పక్కాగా రూపొందించాలని సూచించారు. విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతుంటే సరిచేయాలని చెప్పారు. విద్యుత్ సంబంధిత సేవల కోసం 91333 31912 నంబర్‌కు వాట్సాప్ చేయాలని కోరారు. అకౌంట్స్ ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.

జిల్లా యంత్రాంగం అప్రమత్తం

నెల్లూరు(క్రైమ్): అనంతపురం జిల్లాలో రాములోరి రథానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించిన ఘటనతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు ఆలయాలు, మసీదులు, చర్చిల వద్ద భద్రత ఏర్పాట్లను ఆయా ప్రాంత పోలీస్ అధికారులు బుధవారం పరిశీలించారు. పలు చోట్ల సీసీ కెమెరాలు, సెక్యూర్టీ గార్డుల్లేకపోవడంతో తక్షణమే ఏర్పాటు చేసుకోవాల్సిందిగా ఆలయ కమిటీలకు సూచించారు. ప్రార్థన మందిరాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు.

'సమర్థ'తో జౌళి పరిశ్రమ అభివృద్ధి



సర్టిఫికెట్లను అందజేస్తున్న చంద్రిమ ఛటర్జీ

నెల్లూరు(దర్గామిట్ట): సమర్థ పథకం ద్వారా జౌళి పరిశ్రమ మరింత అభివృద్ధి చెందనుందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీ సెక్రటరీ చంద్రిమ ఛటర్జీ పేర్కొన్నారు. నగరంలోని బీఎం కన్వెన్షన్ హాల్లో స్కిల్ కాన్క్లేవ్‌ను జిల్లా చేనేత శాఖ ఏడీ వరప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. జౌళి శాఖ అధికారులు వినీల్ అమిత్ కుమార్, ఐఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.